

మైనార్టీలకు అండగా ప్రభుత్వం

మైనార్టీలకు ఏ ప్రభుత్వం చేయని విధంగా బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా నిలిచి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిందని రాష్ట్ర హోం మంత్రి మహమూద్ అలీ అన్నారు. 11లో▸



ఆరు గ్యారంటీ హామీలతో మేలు

కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలతో అన్ని వర్గాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ఆ పార్టీ మంచిర్యాల అభ్యర్థి ప్రేంసాగర్‌రావు అన్నారు. మంచిర్యాలలో ప్రచారం చేశారు. 11లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.0 /21.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. రాత్రివేళ చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు వీస్తాయి.

పైసా తీయాలంటే భయం!

- ఐటీ, ఈడీ సోదాలతో అభ్యర్థుల్లో ఆందోళన
- వ్యాపార వర్గాల్లోనూ నగదు రవాణాపై జంకు
- ఎన్నికల వేళ డబ్బు నిల్వ, సరఫరాపై ప్రభావం



తాండూరు మండలం రేపల్లెవాడ మహేశ్వరి మిల్లులో రెండో రోజు ఐటీ అధికారుల సోదాలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఐటీ(ఇన్‌కం ట్యాక్స్), ఈడీ(ఎన్‌ఫోర్స్‌మెంటు డైరెక్టరేట్) అధికారుల సోదాలతో రాజకీయ నేతలు, వ్యాపార వర్గాల్లో భయం పుడుతోంది. గత రెండ్రోజులుగా మంచిర్యాల, కుమురంభీం జిల్లాల్లో అధికారులు తనిఖీ చేస్తున్న విషయం తెలిసిందే. మాజీ ఎంపీ వివేక్ ఆస్తులపై ఏకకాలంలో ఐటీ, ఈడీ దాడులు జరిగాయి. అదే సమయంలో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, తాండూర్ మండలం రేపల్లెవాడలో జిన్నింగ్ వ్యాపారులు, రాజకీయ నాయకు ల ఇళ్లలో సోదాలు జరగడంతో అంతా అప్రమత్తం అయ్యారు. ఈ తనిఖీల దెబ్బతో డబ్బులు బయటకు తీసేందుకు జంకుతున్నారు. మిల్లులపై తనిఖీలు చేయాలని ఎవరి నుంచి ఫిర్యాదు వెళ్లిందో తెలియనప్పటికీ పత్తి కొనుగోళ్ల సమయంలో వ్యాపారులకు ఈ తనిఖీలు షాక్‌నిచ్చాయి. యేటా ఉమ్మడి జిల్లా పరిధిలో జిన్నింగ్ మిల్లుల వ్యాపారులు రూ.వందల కోట్ల లావాదేవీలు చేస్తుంటారు. గతంలో ఎన్నడూ లేనట్లుగా ఈసారి ఆదాయపన్ను శాఖ అధికారులు మిల్లుల ఆర్థిక లావాదేవీలపై ప్రత్యేక దృష్టి సారించారు. రాష్ట్రంలో ఏకకాలంలో పలు చోట్ల పత్తి మిల్లులు, యజమానుల ఇళ్లపై దాడులు జరుగుతున్నాయి.

ఎన్నికల్లో డబ్బుతోనే పని !

ఎన్నికల వేళ పైసా తీయనిదే ఏ పని జరగడం లేదు. ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు రోజుకు రూ.లక్షల్లోనే ఖర్చు చేయాల్సి వస్తోంది. ఖర్చు కోసం ముందు ఎవరి స్థాయిలో వాళ్లు ఆర్థిక వనరులు సమీకరించుకుని ఉన్నారు. నమ్మకస్తులైన అనుచరులు, వ్యాపారులు, బంధువులతోనే ఎన్నికల్లో ఆర్థిక లావాదేవీలు నడిపిస్తున్నారు. బ్యాంకుతో లావాదేవీలు కాకుండా నేరుగా నగదు రూపంలోనే వ్యవహారాలు సాగుతున్నాయి. ఎన్నికల నిబంధనల ప్రకారం పోటీలో ఉన్న అభ్యర్థి రూ.40లక్షల వరకు ఖరుచేసే పరిమితి ఉంది. కానీ అంతకుమించి ఖర్చు జరుగుతున్నా లెక్కల్లో కనిపించకుండా జాగ్రత్త వహిస్తున్నారు. ఎక్కడా లెక్కకు మించి ఖర్చులో చిక్కకుండా చూసుకుంటున్నారు. రోజువారీ ప్రచారం, సభలు, సమావేశాలు, భోజనాలు, ర్యాలీలు, వాహనాలు, బహిరంగసభలు, కరపత్రాలు, ప్రకటనలు, నాయకుల జేబు ఖర్చులు, తాయిలాలకు భారీగా వెచ్చిస్తున్నారు. కానీ అధికార లెక్కల్లో కనిపించకుండా జాగ్రత్త పడుతున్నారు. ఇక ప్రత్యర్థులు సైతం నగదు రవాణాపై దృష్టి సారించి ఎక్కడ డబ్బు కనిపిస్తే అక్కడ ఫిర్యాదు చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. పోటీలో ఉన్న ప్రధాన అభ్యర్థులు పరస్పరం ఒకరిపై ఒకరు తమ మనుషులతో నిఘా ఏర్పాటు చేసి కట్టడికి ప్రయత్నిస్తున్నారు. ఎన్నికల్లో ప్రలోభాలకు గురి కాకుండా ఈసారి ఎన్నికల కమిషన్ ప్రత్యేక దృష్టి సారించి రూ.50వేల కంటే ఎక్కువ నగదు తీసుకెళ్తే సీజ్ చేస్తోంది. సరైన ఆధారాలు చూపిస్తేనే అధికారులు తిరిగి ఇస్తున్నారు. విలువైన బహుమతులు, బంగారం, వెండి, తదితర తరలింపుపైనా తనిఖీలు జరుగుతున్నాయి. చెక్‌పోస్టుల్లో నిత్యం పరిశీలనలు చేపడుతున్నారు.

పరిస్థితి మారేవరకు

పోలింగ్ తేదీ సమీపిస్తున్న తరుణంలో అభ్యర్థులకు డబ్బు తరలింపు ఐటీ, ఈడీ సోదాలు ఇబ్బందిగా మారింది. పోల్ మేనేజ్‌మెంటులో కీలకమైన నగదు పంపిణీ ఎన్నికల్లో గెలుపోటములను ప్రభావితం చేస్తుంటాయి. ఈ క్రమంలో డబ్బును ఎక్కడ నుంచి ఎప్పుడు తీసుకురావాలి? ఎవరి వద్ద నిల్వ ఉంచాలి? ఎలా కిందిస్థాయి వరకు సరఫరా చేయాలి? అనే కోణంలో ఆలోచనలు చేస్తున్నారు. బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్, తదితర పార్టీలు అభ్యర్థులకు పంపే నగదుపై ప్రభావం పడుతోంది. ఎక్కడికక్కడ నియోజకవర్గాలు, పట్టణాల్లో నమ్మకస్తులైన కాంట్రాక్టర్లు, వాణిజ్య ఏజెన్సీ, డీలర్లు, బడా వ్యాపార వర్గాలు కూడా నగదు తరలింపులో సాయం చేసేందుకు జంకుతున్నారు. తమపైనా ఐటీ దాడులు జరుగుతాయనే భయంతో ఉన్నారు. ఈ పరిస్థితుల్లో రెండు మూడు రోజుల వరకు డబ్బులు బయటకు తీయకుండా అదును చూసి రవాణా చేసే పనిలో ఉన్నారు.

ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి

- సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్‌వ్యాస్



పాల్గొన్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలని సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్‌వ్యాస్ అన్నారు. బుధవారం ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇతర ఉన్నతాధికారులతో కలిసి జిల్లా ఎన్నికల అధికారులతో ఎన్నికల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30న ఎన్నికల పోలింగ్‌కు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. నూతన ఓటర్లకు గుర్తింపు కార్డులు సకాలంలో పంపిణీ చేయాలని ఆదేశించారు. పోలింగ్ సిబ్బంది, అత్యవసర సేవల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించాలని, ఈవీఎంల ర్యాండమైజేషన్ పూర్తి చేయాలని తెలిపారు. ప్రతీ ఎన్నికల అధికారి పరిధిలో ఈవీఎంల పంపిణీ కేంద్రాలు, రిసెప్షన్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి.సంతోష్, అదనపు కలెక్టర్ మోతిలాల్, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

రేపు నస్పూర్‌కు సీఎం కేసీఆర్ రాక



నస్పూర్‌లో సభ నిర్వహణకు ఏర్పాట్లు

నస్పూర్: ఎన్నికల ప్రచారంలో భాగంగా జిల్లాలోని నస్పూర్‌లో ఈ నెల 24న నిర్వహించనున్న ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొనడానికి సీఎం కేసీఆర్ రానున్నట్లు బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అక్కూరి సుబ్బ య్య తెలిపారు. కలెక్టరేట్ సమీపంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు సభలో పాల్గొంటారని పేర్కొన్నారు. పట్టణంలోని కార్మికులు, కార్మికేతరులు, బీఆర్ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు.

విధులు బాధ్యతాయుతంగా నిర్వర్తించాలి



ఈవీఎం, వీవీప్యాట్‌ను పరిశీలిస్తున్న రాహుల్

బెల్లంపల్లిరూరల్: అధికారులు ఎన్నికల విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని బెల్లంపల్లి రిట్నరింగ్ అధికారి బి.రాహుల్ అన్నారు. బుధవారం బెల్లంపల్లి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారుల శిక్షణ శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధులను ప్రతి ఒక్కరూ క్షుణ్ణంగా తెలుసుకుని ఉండాలని అన్నారు. పొరపాట్లు జరగకుండా అన్ని రకాల జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో ప్రవర్తన నియమావళిపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల ప్రక్రియలో తప్పులు దొర్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న అధికారులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు.

రూ.20లక్షలు స్వాధీనం



సోదాల్లో పాల్గొన్న అధికారులు

తాండూర్: మండలంలోని రేపల్లెవాడ శివారు మహేశ్వరి ప్రైవేటు జిన్నింగ్ మిల్లులో రెండో రోజు బుధవారమూ ఐటీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. మంగళవారం తెల్లవారు జామున చేపట్టిన తనిఖీలు రాత్రి వరకు సాగాయి. బుధవారం ఉదయం ఐటీ అధికారులు జిన్నింగ్ మిల్లుపై ప్రత్యేక దృష్టి సారించి నిశితంగా రికార్డుల పరిశీలన చేసినట్లు తెలుస్తోంది. మిల్లు ప్రారంభం నుంచి లెక్కకు మించిన ఆర్థిక లావాదేవీలు జరపడంతోనే సుదీర్ఘంగా తనిఖీలు చేపట్టినట్లు తెలుస్తోంది. ప్రతీ ఆర్థిక లావాదేవీలను క్షుణ్ణంగా పరిశీలించినట్లు సమాచారం. రెండ్రోజుల సోదాల్లో సుమారు రూ.20లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. పత్తి అమ్మకాలకు సంబంధించి నగదు అడ్వాన్స్‌గా తెచ్చి పెట్టుకున్నట్లుగా మిల్లు సిబ్బంది అధికారులకు వివరించినట్లు తెలుస్తోంది. జిన్నింగ్ మిల్లు బయట స్థానిక పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న బిశ్వజిత్ దత్తా

వేమనపల్లి: పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల సౌకర్యార్థం టెంట్, వీల్‌చైర్లు, తాగునీటి, రవాణా సౌకర్యాలు ఉండాలని బెల్లంపల్లి నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు బిశ్వజిత్ దత్తా అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలోని నీల్వాయి, కేతన్‌పల్లి, జాజులపేట, సుంపుటం, వేమనపల్లి గ్రామ పంచాయతీల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. సీసీ కెమెరాలు, వెబ్‌కామ్ ఏర్పాటు చేయాలని, పోలింగ్ తేదీ సమయం వరకు ఓటు హక్కుపై ప్రచారం చేయాలని ఆదేశించారు. ఓటరు స్లిప్‌ల పంపిణీపై అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ సదానందం, ఎంపీడీఓ లక్ష్మయ్య, ఎంపీఓ బాపురావు, ఎస్సై సుబ్బారావు, ఆర్‌ఐ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

'మత్తు'గా అమ్మకాలు

- 43రోజుల్లో రూ.138.72 కోట్ల విలువైన మద్యం విక్రయం
- ఈ నెలాఖరుతో ముగియనున్న పాత మద్యం పాలసీ
- వ్యాపారులకు చివరి నెలలో కలిసొచ్చిన వైనం



మంచిర్యాలక్రైం: పాత మద్యం పాలసీ గడువు ఈ నెలాఖరుతో ముగియనుండగా దసరా, అసెంబ్లీ ఎన్నికలు కలిసి రావడం మద్యం వ్యాపారులకు వరంగా మారింది. గత నెల 9నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి రాగా భారత ఎన్నికల సంఘం మద్యం అమ్మకాలపై ఆంక్షలు విధించింది. దీంతో వైన్స్ దుకాణాల వ్యాపారుల్లో ఆందోళన ఏర్పడింది. కానీ అందుకు భిన్నంగా మద్యం అమ్మకాలు సాగడంతో ఆనందం నెలకొంది. ఎన్నికల నియమావళి ప్రకారం బెల్ట్‌షాపులను నివారిస్తూ మద్యం అక్రమ రవాణా అరికట్టడంతో దుకాణాల్లో మద్యం అమ్మకాలు పెరిగాయి. ఎన్నికల వేళ జిల్లాలో మద్యం ఏరులై పారుతోందనడానికి అమ్మకాల లెక్కలే నిదర్శనం. కోడ్ అమలుకు ముందు సెప్టెంబర్ 1నుంచి అక్టోబర్ 9వరకు మద్యం విక్రయాలు, కోడ్ అమలు తర్వాత అక్టోబర్ 9 నుంచి నవంబర్ 19వరకు జరిగిన మద్యం అమ్మకాల తీరును పరిశీలిస్తే మద్యం అమ్మకాలు విపరీతంగా పెరిగాయి. ఎన్నికల జాతర సాగుతున్న తరుణంలో మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. గత నెల 9న నోటిఫికేషన్ విడుదల నాటి నుంచి వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ఎమ్మెల్యే అభ్యర్థులుగా బరిలో దిగేందుకు ఎవరికి వారు తమ బలం, బలగాన్ని అధిష్టానం ఎదుట ప్రదర్శించేందుకు, గల్లీ నాయకులను వెంట తిప్పుకునేందుకు విందు, వినోదాలకు మందు పార్టీలు చేపట్టారు. పెద్దమొత్తంలో మద్యం కొనుగోలు చేసి నాయకుల అనుచరుల ఇళ్లలో నిల్వ చేసుకోవడం, కోడ్ భాషతో టోకెన్లు ఇచ్చి మద్యం పంపిణీ చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎక్సైజ్ శాఖకు కాసుల వర్షం కురుస్తోంది. పోలీసులు కొరడా ఝులిపిస్తూ 327 బెల్ట్‌షాపులు మూసివేశారు. దీంతో వైన్స్‌లకు గిరాకీ పెరిగింది.

పెరిగిన మద్యం అమ్మకాలు

జిల్లాలో 73 వైన్స్‌లు, 16 బార్లు ఉన్నాయి. షెడ్యూల్ విడుదలకు ముందు సెప్టెంబర్ 1నుంచి అక్టోబర్ 9వరకు అంటే 40 రోజుల్లో జిల్లాలో రూ.108.22 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు జరిగాయి. షెడ్యూల్ విడుదల తర్వాత అక్టోబర్ 9 నుంచి నవంబర్ 22వరకు అంటే 43 రోజుల్లో రూ.138.72 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. గత ఏడాది 2002 అక్టోబర్ 9 నుంచి నవంబర్ 22వరకు రూ.126.17 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు సాగాయి. ఎన్నికల కోడ్ అమలుకు ముందు 40 రోజులు, అమలు తర్వాత 43 రోజుల్లో జరిగిన అమ్మకాలు పరిశీలిస్తే రూ.30.56 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు జరిగినట్లు తెలుస్తోంది.

మద్యం నిల్వ

అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఈ నెల 30 నిర్వహించనున్న నేపథ్యంలో మద్యం పంపిణీని అరికట్టేందుకు ఈ నెల 28 నుంచి 30వ తేదీ సాయంత్రం వరకు మద్యం దుకాణాలు మూసి వేయాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. దీంతో మూడు రోజులు మద్యం కొనుగోలుకు అవకాశం లేనందున వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అభ్యర్థులు ముందస్తుగా మద్యం పెద్ద మొత్తంలో కొనుగోలు చేసి అనుచరుల ఇళ్లలో నిల్వ చేసేందుకు ప్రయత్ని స్తున్నట్లు సమాచారం. ఇప్పటికే కొందరు మద్యం నిల్వ చేసినట్లు ఆరోపణలున్నాయి. కొందరు పక్క రాష్ట్రం నుంచి మద్యం తెప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల ప్రచారం చేసిన వారికి సాయంత్రం అయిందంటే చాలు మందు, విందు పార్టీలు ఏర్పాటు చేస్తున్నారు.

మద్యం విక్రయాలు

2022 అక్టోబర్ 9 నుంచి నవంబర్ 22వరకు రూ.126.17కోట్లు

2023 సెప్టెంబర్ 1నుంచి అక్టోబర్ 9వరకు రూ.108.22కోట్లు

2023 అక్టోబర్ 10 నుంచి నవంబర్ 22వరకు రూ.138.72కోట్లు

షాడో బృందాలతో ప్రత్యేక నిఘా...



అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మద్యం అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాం. షాడో టీమ్స్‌తో ఆకస్మిక దాడులు నిర్వహిస్తున్నాం. ప్రత్యేక నోడల్ అధికారులతో వాహనాల తనిఖీలు చేపడుతున్నాం. పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో బెల్ట్‌షాపులపై దాడులు, వైన్స్‌లో మద్యం అమ్మకాలపై నిరంతరం తనిఖీలు చేసి కేసులు నమోదు చేస్తున్నాం. జిల్లాలో కోడ్ అమలు నాటి నుంచి 327 బెల్ట్ షాపులు మూసివేశాం. 886 కేసులు, 650 మందిని అరెస్ట్ చేశాం. బార్లు, వైన్స్ షాపుల్లో నిర్ణీత సమయం వరకు మాత్రమే అమ్మకాలు చేపట్టాలి. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయి.

– కేజీ నందగోపాల్, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి, మంచిర్యాల

ఎన్నికల నిబంధనలు తెలుసుకోవాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి. సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి, పోలింగ్ రోజు పాటించాల్సిన నిబంధనలు ఎన్నికల అధికారులు తెలుసుకుని ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. బుధవారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్‌లో సెక్టోరల్ అధికారుల శిక్షణ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్, పశుసంవర్ధక శాఖ సంచాలకులు రమేష్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి సంతోష్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో ప్రతీ అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకమని, శిక్షణలో మాస్టర్ ట్రైనర్ల ద్వారా అందిస్తున్న ప్రతీ అంశాన్ని పూర్తిగా నేర్చుకోవాలని అన్నారు. పోలింగ్, కౌంటింగ్‌లో పొరపాట్లకు తావు లేకుండా నిర్వర్తించాల్సిన విధులపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాట్ల వినియోగంపై నమూనా యంత్రాల ద్వారా అవగాహన కల్పించారు. అంధులు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు బ్రెయిలీ స్టిక్కర్స్ సహాయంతో బ్యాలెట్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. పోలింగ్ రోజు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఏర్పడే సమస్యల పరిష్కారంలో సెక్టోరల్ అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. ఈ నెల 23న ర్యాండమైజేషన్ ద్వారా ఎంపిక చేసిన ఈవీఎంలను కమీషనింగ్ చేస్తామని, ఈ ప్రక్రియలో చేతి గడియారాలు, మొబైల్ ఫోన్ల వంటి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించబోమని తెలిపారు. బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్ల ఏర్పాటు, పోలింగ్ రోజు సమస్య తలెత్తినట్లయితే వెంటనే తీసుకోవాల్సిన చర్యలు, పోలింగ్ రోజు రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నిర్వహించే మాక్ పోలింగ్ ప్రక్రియపై వివరించారు.

కొనుగోలు కేంద్రాలకు మిల్లుల ట్యాగింగ్

సాక్షి స్పందన

మంచిర్యాలఅగ్రికల్చర్: 'దళారులకే ధాన్యం' శీర్షి కన 'సాక్షి'లో బుధవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ధాన్యం సేకరణలో దళారుల హవా కొనసాగుతోందని, కొనుగోలు కేంద్రాలకు రైస్‌మిల్లులకు ట్యాగింగ్ లేక కొనుగోలు చేయడం లేదనే అంశాన్ని వెలుగులోకి తెచ్చింది. దీంతో జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ ఆదేశాల మేరకు బుధవారం సాయంత్రం కొనుగోలు కేంద్రాలు, రైస్‌మిల్లులకు రవాణా వాహనాలను ట్యాగింగ్ చేశారు. ధాన్యం సేకరణ వేగవంతం చేయాలని, రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో రారైస్ మిల్లులు, బాయిల్డ్ రైస్‌మిల్లులు 54 ఉండగా గత సీజన్‌లో ధాన్యం 60 శాతం సీఎంఆర్ పూర్తి చేసిన 12 బాయిల్డ్ రైస్‌మిల్లులు, 17 రా రైస్‌మిల్లులకు ట్యాగింగ్ చేశారు. దీంతో కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యం రైస్‌మిల్లులకు తరలించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం 10 మంది రైతులకు సంబంధించిన 69 మెట్రిక్ టన్నుల ధాన్యం తూకం వేసి మిల్లులకు తరలించారు.

ఎన్నికలకు వాహనాలు సిద్ధం

- 185 బస్సులు, 15 టాటా ఏస్, 100 కార్లు
- ప్రతీ వాహనానికి జీపీఎస్ ఏర్పాటు
- వాహనాలు సమకూర్చిన రవాణా శాఖ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు జిల్లాలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికల విధులు నిర్వర్తించే ఉద్యోగులు, సామగ్రిని పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు అవసరమైన వాహనాలను జిల్లా రవాణా శాఖా ఆధ్వర్యంలో సమకూర్చుతున్నారు. ఈ మేరకు జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో అవసరమైన వాహనాలను రవాణా శాఖా జిల్లా అధికారి కిష్టయ్య పర్యవేక్షణలో ఏర్పాటు చేశారు. ఎన్నికల అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, స్టాటికల్ సర్వేలెన్స్ టీం ఇలా అన్ని రకాల ఎన్నికల అధికారులు, సిబ్బందితోపాటు సెక్టోరియల్ అధికారులు, అన్ని విభాగాల బృందాలకు వాహనాలు వినియోగించేలా రవాణా శాఖ అన్ని ఏర్పాట్లు చేసింది.

వాహనాలు ఏర్పాటు చేశాం..

ఎన్నికల విధులకు వినియోగించే వాహనాలన్నీ ఏర్పాటు చేశాం. సెక్టోరియల్ అధికారుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాలను అందరూ వినియోగిస్తుండగా కొంతమందికి శుక్రవారం నుంచి వినియోగించేలా ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు కార్లు అప్పగిస్తాం.

– కిష్టయ్య, డీటీఓ, మంచిర్యాల

మూడు నియోజకవర్గాల్లో..

పోలింగ్ జరిగే గ్రామాలకు సిబ్బందితోపాటు సామగ్రిని తరలించేలా రవాణా శాఖా బస్సులు ఏర్పాటు చేసింది. జిల్లాలోని మూడు నియోజకవర్గాలకు మొత్తం 185 ఆర్టీసీ, స్కూల్ బస్సులను సర్దుబాటు చేసింది. వీటిలో మంచిర్యాల నియోజకవర్గంలోని 33 రూట్లకు 65 బస్సులు, బెల్లంపల్లి నియోజకవర్గంలో 32 రూట్లకు 60 బస్సులు, చెన్నూర్ నియోజకవర్గంలోని 30 రూట్లకు 60 బస్సులు కేటాయించారు. ఈ వాహనాలు వెళ్లే ప్రతీ రూట్‌ను సమీక్షించేలా జీపీఎస్ విధానాన్ని అమర్చనున్నారు. బస్సులన్నీ ఈ నెల 29న సాయంత్రం మంచిర్యాల డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి చేరుకుంటాయి. అక్కడి నుంచి పోలింగ్ సిబ్బంది, సామగ్రిని తీసువెళ్లి పోలింగ్ ముగిసిన తర్వాత 30న సాయంత్రం తీసుకురావాల్సి ఉంటుంది. ఆయా నియోజకవర్గాలకు అన్ని రకాల ఎన్నికల అధికారులతోపాటు సెక్టోరియల్ అధికారులను నియమించారు. వీరి కోసం 100 కార్లు సమకూర్చారు. ఇందులో మంచిర్యాలకు 36 కార్లు, చెన్నూర్‌కు 32, బెల్లంపల్లికి 32 కార్లు ఏర్పాటు చేశారు. అధికారులతోపాటు పోలింగ్ సిబ్బంది, సామగ్రిని తరలించే అన్ని వాహనాలకు కూడా జీపీఎస్ ఏర్పాటు చేస్తున్నారు. ఇక సెక్టోరియల్ అధికారులకు ఇప్పటికే వాహనాలను అప్పగించగా బెల్లంపల్లి నియోజకవర్గ పరిధిలోని సెక్టోరియల్ అధికారులు 24 నుంచి ఎన్నికల కార్యకలాపాలను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు కార్లు అప్పగించనున్నారు. ఈ వాహనాలన్నీ కూడా గత 15 రోజులుగా ప్రత్యేక ప్రణాళికతో సమీక్షించి సమకూర్చారు.

క్లుప్తంగా

కాంట్రాక్టు కార్మికులకు సీఎంపీఎఫ్ పుస్తకాలు అందజేత



పాస్ పుస్తకాలతో కాంట్రాక్టు కార్మికులు

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు బుధవారం సీఎంపీఎఫ్ (కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్) పాస్ పుస్తకాలను పంపిణీ చేసినట్లు ఏరియా యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. దీంతో కార్మికులు 2021 నుంచి ఇప్పటి వరకు ప్రతి నెల వేతనం నుంచి పొదుపు చేస్తున్న నగదు వివరాలను తెలుసుకోవచ్చని సూచించింది. ప్రతి ఉద్యోగి తమ డిపార్టుమెంట్‌లలో యాజమాన్యం అందచేసిన సీఎంపీఎఫ్ పాస్ పుస్తకాలను తీసుకోవాలని యాజమాన్యం కోరింది.

ముగిసిన తైక్వాండో ఎంపిక పోటీలు



పోటీలకు ఎంపికైన విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: స్కూల్ గేమ్స్ అండ్ ఫెడరేషన్ మంచిర్యాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి అండర్ 14, 17 బాలబాలికలతైక్వాండో ఎంపిక పోటీలు బుధవారం ముగిశాయి. సెవెన్‌హిల్స్ స్కూల్‌లో నిర్వహించిన పోటీలకు 110మంది విద్యార్థులు పాల్గొన్నారు. గెలుపొందిన విద్యార్థులు జోనల్‌స్థాయిలో పాల్గొంటారని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పరిమిళ తెలిపారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా మంద శ్రీనివాస్, శ్రావణ్, అజయ్‌లు వ్యవహరించగా కన్వీనర్ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

బెల్లంపల్లి వాసి మృతి

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి షంషీర్‌నగర్ బస్తీకి చెందిన ఎలిగేటి సారయ్య(72) బుధవారం కాజీపేట్ రైల్వేస్టేషన్‌లో మృతి చెందాడు. విశ్వసనీయ సమాచారం మేరకు వ్యక్తిగత పని నిమిత్తం సారయ్య వరంగల్‌కు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో కాజీపేట్ రైల్వేస్టేషన్‌కు చేరుకుని బెల్లంపల్లి టికెట్ తీసుకున్నాడు. రైలు కోసం వేచిచూస్తున్న సమయంలో ప్లాట్‌ఫామ్‌పై ఒరిగి ప్రాణాలు వదిలాడు. ఆకస్మికంగా గుండె నొప్పి రావడంతోనే సారయ్య చనిపోయినట్లు రైల్వే పోలీసులు అనుమానిస్తున్నారు.

నాయకులపై కేసు

ఆసిఫాబాద్అర్బన్: జిల్లా కేంద్రంలోని సందీప్‌నగర్‌లో సోమవారం రాత్రి 11 గంటల సమయంలో జరిగిన గొడవలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలపై కేసు నమోదైనట్లు సమాచారం. కాలనీకి చెందిన రేణుక, రాజక్క, నర్సమ్మలు రాత్రి సమయంలో కాలనీకి ఎందుకు వచ్చారని ప్రశ్నించడంతో వివాదం చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో వారిపై బెదిరింపులకు పాల్పడినట్లు ఫిర్యాదు చేయగా అదే సమయంలో బీఆర్‌ఎస్ నాయకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కాంగ్రెస్ నాయకులు శ్యాంనాయక్, విశ్వప్రసాద్, మంగతో పాటు తదితరులపై కేసులు నమోదు కాగా కాంగ్రెస్ నేతల ఫిర్యాదు మేరకు బీఆర్‌ఎస్ నాయకులు శ్రావణ్, సాయి, నిసార్‌తో పాటు పలువురిపై కేసులు నమోదైనట్లు తెలుస్తోంది. రాత్రి సమయంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లో ఉన్నందున ఉల్లంఘన కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆలోచించి ఎన్నుకుందాం

- అభివృద్ధికే ప్రాధాన్యమంటున్న యువత
- తొలిసారిగా సార్వత్రిక ఎన్నికల్లో వినియోగం..
- నిజాయతీ గల నాయకుడి వైపే మొగ్గు
- మొదటిసారి ఓటు హక్కు వచ్చిన వారి మనోగతం



మంచిర్యాలటౌన్: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ఎంతో విలువైనది. అందుకే యువత ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేందుకు ఎన్నికల సంఘం, అధికారులు ఎన్నో రకాలుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. చదువుకునే వయస్సులో 18ఏళ్లు నిండిన వారికి నూతనంగా ఓటు హక్కు వస్తుంది. కళాశాలల్లో చదివే విద్యార్థులు వారి ఓటును సద్వినియోగం చేసుకునేందుకు అధికారులు అన్ని రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. నూతనంగా ఓటు హక్కు పొందిన వారు ఈ నెల 30వ తేదీ జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో వారి ఓటును వేసేందుకు ఉత్సాహంగా పలువురు ఎదురుచూస్తున్నారు. పాలకులను నిర్ణయించుకునే హక్కు మనదే కావడం, మంచి పాలన కావాలన్నా.. ప్రజా సమస్యలు తీరాలన్నా... ఆశలు నెరవేరాలన్నా... ఓటు అనే వజ్రాయుధాన్ని సద్వినియోగం చేసుకోవాలని నూతన ఓటర్లు భావిస్తున్నారు.

ఉత్సాహంగా ఉన్నాను



మంచిర్యాలటౌన్: నాకు వచ్చిన ఓటు హక్కును మొదటిసారి ఈ నెలలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో వినియోగించుకుంటున్నాని ఎంతో ఉత్సాహంగా ఉన్నాను. ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడంలో అన్ని విధాలుగా ఆలోచించి ఓటు వేస్తాను. ప్రతిఒక్కరూ ఓటు వేయాలి.

– దేవకి, డిగ్రీ విద్యార్థిని, మంచిర్యాల

ఇంట్లో వారందరితో ఓటు వేయిస్తా



మంచిర్యాలటౌన్: నాకు వచ్చిన ఓటు హక్కును నేను సద్వినియోగం చేసుకోవడంతో పాటు, మా ఇంట్లో ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు వేసేలా చూస్తాను. మొదటిసారి ఓటు వేస్తున్నా, అన్ని విధాలుగా ఆలోచించిన తరువాతనే నా ఓటును వేస్తాను.

– శ్రీలత, డిగ్రీ విద్యార్థిని, మంచిర్యాల

పోలింగ్ రోజు వస్తాను..



మంచిర్యాలటౌన్: నాకు వచ్చిన ఓటు హక్కును మొదటిసారి ఎంత ఉత్సాహంగా సద్వినియోగం చేసుకుంటాను. అలాగే ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఓటు తప్పనిసరిగా వేస్తాను. ఇందు కోసం ఎక్కడున్నా, పోలింగ్ తేదీ రోజున నా ఓటు ఎక్కడ ఉంటే అక్కడికి వచ్చి తప్పకుండా ఓటు వేస్తాను.

– సందీప్ ప్రసాద్, బీఫార్మసి విద్యార్థి, మంచిర్యాల

నిజాయతీ గల అభ్యర్థికే..



బెల్లంపల్లి: సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు వచ్చింది. కాలేజీలో చాలా సార్లు మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈసారి కొత్తగా ఓటు హక్కు రావడంతో వయోజనులతో సమానంగా ఓటు వేయబోతున్నాననే సంతోషం కలుగుతోంది. ఓటును దుర్వినియోగం చేసుకోను. నిజాయితీ గల అభ్యర్థికి ఓటు వేస్తాను.

– కాళ్ల సాయిశ్రీ , కన్నెపల్లి

ఆనందంగా ఉంది..



బెల్లంపల్లి: ఎన్నికల్లో అమ్మా నాన్న ఓటు వేయడం ఇప్పటి వరకు చూశాను. కానీ ఈసారి నాకు కూడా ఓటు హక్కు వచ్చింది. కొత్తగా ఓటు హక్కు రావడం ఆనందంగా ఉంది. ఈసారి జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో తల్లిదండ్రులతో సమానంగా ఓటు వేస్తాను. ప్రజల కోసం పనిచేసే వారికే ఓటు వేస్తాను.

– ఉట్నూరి మాధురి, నెన్నెల

యువత చేతిలో దేశ భవిష్యత్



బెల్లంపల్లి: దేశ భవిష్యత్ యువతదే. ఎన్నికల్లో మంచి నాయకుడిని ఎన్నుకునే కనీస బాధ్యత కూడా ఓటర్లపైనే ఉంటుంది. నా వరకు నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించే రాజకీయ నాయకుడికి ఓటు వేయడానికి తొలిప్రాధాన్యతను ఇస్తాను. నోటుకు ఓటును అమ్ముకోను.

– చెన్నోజీ ప్రణయ్, నెన్నెల

ప్రలోభాలకు గురికాను..



బెల్లంపల్లి: ఎన్నికల్లో ఓటు వేయించుకునేందుకు పోటీలోని అభ్యర్థులు ప్రలోభాలకు గురి చేస్తారనే అపవాదు ఉంది. ఏదో తీరుగా ఓటు వేయించుకుని ఎన్నికల్లో గెలిచిన తర్వాత ఓటర్ల సమస్యలను గాలికి వదిలేస్తుంటారు. మోసపూరితమైన హామీలకు తలొగ్గి ఓటు వేయను. – నిక్కూరి శంకర్, వేమనపల్లి

మేలు చేసే వారికే నా తొలి ఓటు..



చెన్నూర్: ఎన్నికల సంఘం కల్పించిన అవకాశంతో కొత్తగా ఓటు హక్కు లభించింది. నాకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటా. ఈసారి జరిగే ఎన్నికలలో విద్యారంగానికి, నిరుద్యోగులకు మేలు చేసే నాయకున్ని ఎన్నుకుంటాం. –కోయిల సృజన్, విద్యార్థి, చెన్నూర్

అభివృద్ధికే తొలి ప్రాధాన్యం



చెన్నూర్: రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు రావడంతో సంతోషంగా ఉంది. ఈ ఎన్నికల్లో నా తొలి ఓటు హక్కును వినియోగించుకుంటా. అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే సమర్థవంతమైన నాయకున్ని ఎన్నుకుంటా.

– చిలువేరి అర్చన, చెన్నూర్

ఆలోచించి ఓటు వేయాలి



మంచిర్యాలటౌన్: నాకు మొదటిసారిగా ఓటు హక్కు వచ్చింది. డిగ్రీ చదువుతున్నాను. ఎవరిని ఎన్నుకోవాలి, ఏ ప్రభుత్వం ఏర్పడితే బాగుంటుందనేది బాగా ఆలోచించిన తరువాతనే ఓటు వేస్తాను. కానీ మొదటి ఓటును నా జీవితకాలం గుర్తుండాలంటే, అన్ని విధాలుగా ఆలోచించి ఓటు వేయాల్సిందే.

– కోన దినేష్, జెండా వెంకటాపూర్, లక్సెట్టిపేట్

మంచికే నా ఓటు



మంచిర్యాలటౌన్: ఈ ఏడాది నాకు ఓటు హక్కు వచ్చింది. మొదటి సారి నా ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేందుకు మంచికే ఓటు వేస్తాను. బాగా పనిచేస్తారనే నమ్మకం ఉండి, అన్ని వర్గాల ప్రజలకు ఆ నాయకుని వల్ల లబ్ధి చేకూరుతుందని అనిపిస్తే వారికే ఓటు వేస్తాను.

– పెంద్యాల శిరీష, దండేపల్లి

సద్వినియోగం చేసుకుంటా..



మంచిర్యాలటౌన్: మొదటిసారి వచ్చిన ఓటు హక్కును ఈ నెల 30వ తేదీన జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో వినియోగించుకుంటున్నాను. మొదటి ఓటు హక్కు కాబట్టి అన్ని విధాలుగా ఆలోచించిన తరువాతనే నా ఓటు వేసి, నూతనంగా వచ్చిన ఈ హక్కును సద్వినియోగం చేసుకుంటాను.

– జోగుల మణిదీప్, కృష్ణకాలనీ, నస్పూర్

ఎన్నికల ప్రచార ఖర్చును లెక్కించాలి



ఖర్చుల వివరాలు తెలుసుకుంటున్న అధికారి

బెల్లంపల్లిరూరల్: శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ప్రచారంలో భాగంగా చేసే ప్రతీ ఖర్చును లెక్కించాలని ఎన్నికల ఖర్చుల పరిశీలకులు అశోక్‌కుమార్ సత్తార్ అన్నారు. బుధవారం బెల్లంపల్లి రిటర్నింగ్ అధికారి కా ర్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అ భ్యర్థుల ఎన్నికల ప్రచార ఖర్చుల వివరాల న మోదు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అభ్యర్థుల ఎన్నికల ఖర్చు రూ.40లక్షలు పరిమితిగా నిర్ణయించినట్లు తెలిపారు. అభ్యర్థులు ఖర్చు చేసే వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలని, వివరాల్లో తేడా వస్తే ఉపేక్షించేదిలేదని సూచించారు. ప్రచార కార్యక్రమంలో ఓటర్లను ప్రలో భాలకు గురిచేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంలో అధికారులు అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని సూచించారు.

పుస్తకపఠనం అలవరుచుకోవాలి

- ఆర్‌జేడీ సత్యనారాయణ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్‌జేడీ

జన్నారం: విద్యార్థులు తమ పుస్తకాలను చదవడం అలవరుచుకోవాలని దీంతో విద్యార్థికి పాఠ్యంశంపై అవగాహన పెరుగుతుందని వరంగల్ ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి అన్నారు. బుధవారం జన్నారం మండలం కలమడుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరిశీలించారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించినందుకు ఉపాధ్యాయులను అభినందించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ఉన్నత అభ్యాసనాభి కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు ఉపాధ్యాయులు బోధన చేయాలని సూచించారు. ఉపాధ్యాయుల డైరీ, బేస్‌లైన్ టెస్టు వివరాలను పరిశీలించారు. విద్యార్థులను ప్రశ్నలు అడిగి వారి సమాధానాలను చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయుడు కట్ట రాజమౌళి, ఉపాధ్యాయులు ఉన్నారు.

తనిఖీలు ముమ్మరం



బస్టాండ్‌లో తనిఖీ చేస్తున్న పోలీసులు

మంచిర్యాలక్రైం: అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో పోలీసులు రోజురోజుకూ తమ దూకుడు పెంచుతున్నారు. జిల్లాలో తనిఖీలు ముమ్మరం చేశారు. లాడ్జీలు, రైల్వేస్టేషన్లు, బస్టాండ్, పబ్లిక్ అధికంగా ఉండే ప్రాంతాల్లో అనుమానితులను సోదాలు చేస్తున్నారు. ఎన్నికల నిర్వహణకు మరో ఎనిమిది రోజుల గడువు ఉండడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. డబ్బు, మద్యం, ఇతర బహుమతుల రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు తనిఖీలు ముమ్మరం చేశారు. రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి, భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బుధవారం స్థానిక డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్, ఏసీపీ తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్, బస్టాండ్, లాడ్జిల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. లాడ్జిలకు వారంరోజుల నుంచి వచ్చి పోయిన వారి వివరాలను సైతం పరిశీలించారు. లాడ్జీలలో ప్రతి రూమును పరిశీలించారు. మద్యం, డబ్బు, ఇతర బహుమతుల పంపిణీని కట్టడి చేసేందుకు భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిరంతరం తనిఖీలు నిర్వహించడం జరుగుతోందని స్థానిక సీఐ రాజు తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్సైలు రాజేందర్, జగదీష్, మహేందర్ ఉన్నారు.

ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన



ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

మంచిర్యాలటౌన్: ఈ నెల 30న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు వేయాలనే ఉద్దేశంతో ఎన్నికల సంఘం, జిల్లా ఎన్నికల అధికారులు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే జిల్లా కేంద్రంలో బుధవారం డీఆర్డీవో శేషాద్రి ఆధ్వర్యంలో నూతనంగా ఓటరుగా నమోదైన యువతతో కలిసి ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కేంద్రంలోని బెల్లంపల్లి చౌరస్తాలో అవగాహన కల్పించారు. అభివృద్ధి సాధించాలంటే నిజాయితీగా ఓటు వేయాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు, మెప్మా అధికారులు, ఐకేపీ, మెప్మా ఆర్పీలు పాల్గొన్నారు.

ఎన్నికలపైనే ఆసక్తి

- విదేశాల్లో ఉన్నా ఇక్కడి ఎన్నికలపై ఆరా
- రాష్ట్రంలో, నియోజకవర్గంపై ఆసక్తి..
- మంచిర్యాల, చెన్నూరుకు చెందిన వారి ఆసక్తి

మంచిర్యాలటౌన్: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన సమయంలో ఏ ప్రభుత్వం ఏర్పడుతుందోననే ఆసక్తి ఎంతగా నెలకొని ఉందో, ప్రస్తుతం జరుగుతున్న రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలపై అదే ఉత్కంఠ నెలకొంది. రాష్ట్రంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీలు గెలుపు తమదేనని పోటాపోటీగా మెనిఫెస్టోలను రూపొందించి, వాటిని ప్రజల్లోకి తీసుకెళ్తున్నాయి. ఎన్నికల ప్రచారంలోనూ మూడు పార్టీలు తమదైన శైలిలో ముందుకెళ్తుండగా ఎవరు ఎన్నికల ప్రచారం చేపట్టినా, పెద్ద సంఖ్యలో ప్రజలు ఆయా సమావేశాలకు హాజరు కావడంతో, ఓటరు ఏ పార్టీని గెలిపిస్తాడోననే ఆందోళన అన్ని పార్టీల్లోనూ నెలకొంది. మూడు ప్రధాన పార్టీలతో పాటు, కొన్ని రిజిష్టర్ పార్టీల నుంచి పోటీ చేసే అభ్యర్థులు, మరికొందరు స్వతంత్రులు వారి ఎన్నికల ప్రచారంలో కొత్త ఒరవడిని సృష్టించి, ప్రజలను ఆకర్షిస్తున్నారు. ఇందులో ఎంత మంది విజయం వైపు వెళ్తారో, ఎవరి విజయానికి సంబంధించిన ఓట్లను చీలుస్తారోననే ఆసక్తి సైతం నెలకొంది. ఇది మన రాష్ట్రంలోని ప్రజలకే కాదు, మన ప్రాంతానికి చెంది, విదేశాల్లో ఉద్యోగ, ఉపాధి నిమిత్తం స్థిరపడిన వారిలోనూ ఎన్నికల్లో ఎవరు గెలుస్తారనే ఆసక్తి, ఎన్నికలకు సంబంధించిన విషయాలను వారి కుటుంబ సభ్యుల ద్వారా మీడియా ద్వారా తెలుసుకుంటున్నారు.

ఎవరు గెలుస్తారోననే ఆసక్తి



మంచిర్యాలకు చెందిన తాము అమెరికాలో నివసిస్తున్నాం, పుట్టి, పెరిగి, చదువుకున్న ప్రాంతం కావడంతో, ప్రతిసారి జరిగే ఎన్నికల్లో ఏ పార్టీ గెలుస్తుంది, మా ప్రాంతంలో ఏ నేత గెలుస్తాడనే దానిపై ఎంతగానో ఆసక్తి ఉంటుంది. ఎవరు గెలిచినా, అభివృద్ధి, సరైన మౌలిక వసతులను కల్పించాలనే ప్రజలు కోరుకుంటారు.

– పాత స్రవంతి, వెస్ట్‌ఫీల్డ్ ఇండియానపాలిస్, అమెరికా

ప్రతీ ఎన్నికను పరిశీలిస్తాం



మంచిర్యాలకు చెందిన తాను ప్రతీసారి జరిగే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలను నిశితంగా పరిశీలిస్తాను. ఏ ప్రభుత్వం ఏర్పడితే బాగుంటుందనే దానిపై విదేశాల్లో ఉండే మిత్రులం కలిసినప్పుడు చర్చిస్తాం. ఎన్నికల్లో గెలిచిన ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిపై, ఇంకా ఏం చేస్తే బాగుంటుందనే దానిపైనా విశ్లేషన చేస్తుంటాం.

– డి. కిరణ్ కుమార్, చికాగో, అమెరికా

ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి



ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ ఓటును వేసి సద్వినియోగం చేసుకోవాలి. కొన్ని సందర్భాల్లో మనం చదువుల కోసం, ఉద్యోగం, ఉపాధి నిమిత్తం వేరే ప్రాంతాలకు వెళ్లినప్పుడు మన ఓటును సద్వినియోగం చేసుకోలేం. అందుబాటులో ఉండే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు వేయాలి. మా చెన్నూరులో నేను ప్రతిసారి ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్న. ఈ ఎన్నికలపై విదేశాల్లో ఉన్న మన ప్రాంత ప్రజల్లో ఎంతో ఆసక్తి ఉంది.

– పోతు ప్రసన్న, టెక్సాస్, అమెరికా

ఓటు వేయాలని ఉంది



ఎన్నికల సమయంలో ఓటు తప్పనిసరిగా వేస్తాను. ప్రతిసారి ఎన్నికల్లో నా ఓటు హక్కును వినియోగించుకుంటున్నా. ఈసారి జరిగే ఎన్నికలతో పాటు, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేయాలని ఉంది. ఎక్కడ ఉన్నా, మంచిర్యాలలో జరిగే ఎన్నికల్లో ఎవరు లీడ్ చేస్తారు, గెలిచిన వారు ఏవిధంగా హామీలను నెరవేరుస్తారనే దానిపైన చర్చిస్తాం.

– తమ్మిశెట్టి ఓంప్రకాశ్, వెస్ట్‌ఫీల్డ్ ఇండియానపోలీస్, అమెరికా

ఎన్నికల గురించే చర్చ



ఈసారి జరుగుతున్న ఎన్నికలపై అందరిలోనూ ఎంతో ఆసక్తి నెలకొంది. తెలంగాణ ఏర్పడిన తరువాత మూడోసారి జరిగే ఎన్నికలు కావడం, మూడు ప్రధాన పార్టీలు విజయం కోసం పోటీ పడుతుండడంతో, ఏ పార్టీ అధికారంలోకి వస్తుందనే దానిపైనే అంతటా చర్చ జరుగుతోంది. మంచిర్యాలలో ఈసారి ఎవరు గెలుస్తారనే దానిపైనా ఆసక్తి నెలకొంది.

– ఐతరాజు రోహిత్, నార్త్ కరోలినా, అమెరికా

రాష్ట్రాభివృద్ధికి కృషి చేయాలి



ఎంతో కష్టపడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తోంది. ఇప్పటికే రెండు పర్యాయాలు అసెంబ్లీ ఎన్నికలు జరగడంతో, మూడోసారి ఏ ప్రభుత్వం ఏర్పడుతుందనే దానిపైన మాకు ఆసక్తి ఉంది. ఏ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినా, అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లి నిరుద్యోగం లేకుండా చేస్తే బాగుంటుందని అందరి అభిప్రాయం.

– వరుణ్, నార్త్ కరోలినా, అమెరికా

లోక్ అదాలత్‌పై సమావేశం

చెన్నూర్: చెన్నూర్ కోర్టు ఆవరణలో డిసెంబర్ 9న నిర్వహించే లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసుల పరిష్కారానికి పోలీసు అధికారులు కృషి చేయాలని జూనియర్ సివిల్, జూడిషియల్ ఫస్ట్‌క్లాస్ జడ్జి పి.రవి అన్నారు. చెన్నూర్ కోర్టు ప రిధిలోని పోలీసు అధికారులు, పబ్లిక్ పాసిక్యూటర్స్‌లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కోర్టు పరిధిలోని పోలీసు అధికారులు, పీపీలు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతు

నస్పూర్: జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాలలో పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థులకు తమ సంఘం తరుపున తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు మాల మహానాడు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం ఆయన ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. దేశంలోని దళితుల సాధికారత అభివృద్ధి కోసం కాంగ్రెస్ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బూపెల్లి మల్లయ్య, రాష్ట్ర అధికార ప్రతినిధి పొట్ట మధూకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు దమ్మ నారాయణ, నాయకులున్నారు.

గొర్రెల కాపరులపై అటవీ అధికారి దాడి



పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న బాధితులు

జన్నారం: అడవిలోకి గొర్రెలను మేతకు తీసుకెళ్లిన ఇద్దరు కాపరులను అటవీ అధికారి దాడి చేసి బంధించినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులు మంతుర్తి ఐలయ్య, జక్కుల మొగిలి వివరాల ప్రకారం... బుధవారం గొర్రెలను మేపేందుకు జన్నారం బీట్ పరిధిలోకి రావడంతో బీట్ అధికారి సతీశ్ వారిపై దాడి చేసి రేంజ్ కార్యాలయానికి తీసుకెళ్లి కాగితం రాయించుకున్నాడు. తిరిగి వెళ్లేసరికి ఇద్దరికి చెందిన 20గొర్రెలు అడవిలో తప్పిపోయాయి. దాడి చేసిన బీట్ అధికారిపై చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై బీట్ అధికారి సతీశ్‌ను సంప్రదించగా ఎవరిపై దాడి చేయలేదని, అడవిలోకి మేపేందుకు తీసుకురావద్దని ఇప్పటికే పలుమార్లు తెలిపిన వినకపోయే సరికి కాపరులను రేంజ్ కార్యాలయానికి బైక్‌పై తీసుకువచ్చి, వారిచే కాగితం రాయించుకున్నామన్నారు. ఈ విషయంపై ఎస్సై సతీశ్‌ను సంప్రదించగా గొర్రెల కాపరుల ఫిర్యాదు మేరకు బీట్ అధికారిపై కేసు నమోదు చేసినట్లు చెప్పాడు.

రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుడి బ్యాగు అపహరణ

కాగజ్‌నగర్‌టౌన్: హైదరాబాద్ నివాసి హనుమంతు అనే ప్రయాణికుడి బ్యాగు కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌లో బుధవారం అపహరణకు గురైంది. బాధితుడి కథనం ప్రకారం.. కాగజ్‌నగర్‌లోని అత్తగారింటికి వచ్చి తిరిగి హైదరాబాద్‌కు వెళ్లేందుకు కుటుంబ సభ్యులతో కలిసి ఉదయం 11గంటల ప్రాంతంలో రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాడు. స్టేషన్‌లో ఇంటర్సిటీ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కుతుండగా చిన్న బ్యాగును గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించారు. అందులో నాలుగు తులాల బంగారు నగలు, రూ.10వేల నగదు ఉన్నట్లు తెలిపాడు. ఈ మేరకు రైల్వే పోలీసులకు సమాచారం అందించగా వారు తనిఖీ చేసినప్పటికీ ఆచూకీ లభించలేదు. రైల్వే స్టేషన్‌లో సీసీ కెమెరాలు కూడా లేకపోవడంతో ఎలాంటి సమాచారం లభించలేదు. ఈ విషయమై కాగజ్‌నగర్ రైల్వే హెడ్‌కానిస్టేబుల్ సురేష్ గౌడ్‌ను సంప్రదించగా బ్యాగు అపహరణ విషయం తెలిసిందని, లిఖిత పూర్వకంగా ఫిర్యాదు అందలేదన్నారు.